# ఓలమ్మో... సీకాకుళానికి కరెంట్ షాక్ లిచ్చేత్తన్నారు బాబో....





**రాష్ట్రానికే కాదు అభివృద్ధికీ ఆ చివర్న ఉండే శ్రీకాకుళం జిల్లాలో ఉన్నట్టుండి 10 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల ఆరు థర్మల్ ప్లాంట్లు రాబోతున్నాయి. మరో రెండు అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయి. పాలమూరు తర్వాత పనుల కోసం వలసపోయే ప్రజలు అత్యధికంగా ఉన్న శ్రీకాకుళం జిల్లా ఈ 'కరెంట్ షాక్'ల వల్ల తీరప్రాంతాన్ని చాలావరకు కోల్పోయి అదనంగా కొన్నివేల మంది నిర్వాసితుల దుఃఖాన్ని మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

తీరప్రాంతంలోని తంపర, బీల భూముల్నీ పర్యావరణాన్నీ చివరకు ప్రజల జీవితాల్నీ బుగ్గిపాలు చేసే పరిశ్రమల స్థాపన ఈ జిల్లాలో ఇటీవల పెద్దఎత్తున ప్రారంభమైంది. సంతబొమ్మాళి, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో ఆరు బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్లు రాబోతున్నాయి. వెనుకబడ్డ శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి వెలుగులతో నింపడానికే ఈ విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పుతున్నామని పాలకులూ, పారిశ్రామికవేత్తలూ నమ్మబలుకుతున్నారు. కాని స్థానికుల జీవితాల్లో

**డిసెంబర్ 25, 26, 27 తేదీల్లో మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగే ప్రచార యాత్రలను జయప్రదం చేయండి**



# అభివృద్ధి పేరిట వినాశనాన్ని వ్యతిరేకిద్దాం

వెలుగులు నిండడం మాట అటుంచి ఉన్న జీవనాధారాలు సైతం కోల్పోయే ముప్పు ముంచుకురానుంది. నిజానికి స్థానికులకు కొత్తగా ఉపాధి లభించే అవకాశం ఎంతమాత్రం లేదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు పిడికెడు కూడా ఉండవు. అవి కూడా ఉన్నత సాంకేతిక విద్య ఉన్న వాళ్ళకే. పైగా వీటివల్ల పర్యావరణానికి కలగనున్న హాని కూడా చాలా ఎక్కువ. అందుకే ఇటువంటి వినాశకర పారిశ్రామికాభివృద్ధిని వ్యతిరేకించమని మానవ హక్కుల వేదిక శ్రీకాకుళం జిల్లా ప్రజలకు పిలుపునిస్తోంది.

## విలువైన తంపర్లో విద్యుత్ కుంపట్లా?

ఈస్ట్ కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2640 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను సంతబొమ్మాళి మండలం కాకరపల్లి వద్ద నెలకొల్పుతోంది. దాన్ని ఆనుకునే మేఘవరం పవర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ 495 మె.వా. విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ప్రతిపాదించింది. ఈ రెండు పరిశ్రమలకూ ప్రభుత్వం తంపర భూముల్లో 2,450 ఎకరాలను కేటాయించింది. ఇక్కడ తంపర భూముల విస్తీర్ణం 4 వేల ఎకరాలని అంచనా. అంటే ఇందులో సగానికి పైగా భూమిని కంపెనీలకు ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చేసింది. ఇవి పర్యావరణ రీత్యా చాలా ప్రాధాన్యం కలిగినవి. ఈ భూముల్లో ఏడాది పొడవునా నీళ్ల నిలువ వుంటాయి. నౌపడా స్వాంప్స్‌గా పేరొందిన ఈ భూముల్లోకి చుట్టుపక్కల ఉన్న దేశి గెడ్డ (వాగు), గరీబుల గెడ్డ, ఏనుగుల గెడ్డల నుంచి నీళ్లు వచ్చి చేరతాయి.

ఈ తంపర స్థానికులకు ఎన్నోరకాలుగా జీవనాధారం. వారి పంటలకూ, బతుకులకూ ఆసరాగా నిల్చే రక్షక వనరు. తంపర చుట్టూ 5 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరితోసహా ఎన్నో పంటల్ని స్థానికులు పండించుకుంటారు. వర్షాలూ, వరదల కాలంలో ముంపు నుంచి పంటలను ఈ తంపరే కాపాడుతుంది. అలాంటిది ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ సంస్థ నిర్మించిన గట్టువల్ల ఈ ఏడాది ఆగష్టు నెలలో కురిసిన కొద్దిపాటి వర్షాలకే 500 పై చిలుకు ఎకరాల పంట ముంపుకు గురయ్యింది. ప్లాంట్ల నిర్మాణాలు పూర్తయ్యేసరికి ఈ ముంపు ముప్పు ఇంకెంత స్థాయికి చేరుతుందో!

## చిక్కుల్లో మత్స్యకారుల జీవనం

ఈ తంపరపైన ఆధారపడి బతికే కొత్తూరు, వడ్డితాండ్ర, సంతబొమ్మాళిలకు చెందిన మత్స్యకారుల భవితవ్యమే కాదు తీరప్రాంత మత్స్యకారుల భవిష్యత్తూ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిశ్రమలు విద్యుదుత్పత్తికోసం సముద్రం నుంచి భారీ స్థాయిలో నీటిని తోడుకుని వాడుకొంటాయి. ఆ నీటిని తిరిగి సముద్రంలోకి వదిలేస్తాయి కాని ఆ నీటి ఉష్ణోగ్రత సాధారణ సముద్ర జలాల కంటే 5 నుంచి 10 డిగ్రీలు హెచ్చుగా ఉంటుంది. ఈ వేడిని జలచరాలు భరించలేవు. పైగా ఈ నీటిని సముద్రంలో వదిలే చోటు కల్లోలంగా మారుతుంది. దానివల్ల జలచరాల పునరుత్పత్తి దెబ్బతింటుంది. ఫలితంగా తీరం వెంబడి చేపల వేట సాగించే సాంప్రదాయ మత్స్యకారుల జీవనానికి కూడా ముప్పు వాటిల్లుతుంది.

## పక్షికోటికి ప్రాణహాని

ఈ ప్రాజెక్టులకు కేవలం 3 కి.మీ దూరంలో తేలినీలాపురం పక్షుల అభయారణ్యం ఉంది. ఏటా వేల సంఖ్యలో దేశవిదేశీ పక్షులు ఇక్కడకు వచ్చి విడిది చేస్తాయి. చుట్టూ ఉన్న తంపరలో లభించే చేపలూ, క్రిమికీటకాలే వీటికి ఆహారం. థర్మల్

# మన శ్రీకాకుళాన్ని కాపాడుకుందాం



ప్లాంట్ల నిర్మాణం వాటి ఉనికికే ప్రమాదం కలిగిస్తుంది. ఇవేకాక వడ్డితాండ్ర, సంతబొమ్మాళి, కొత్తూరు, ఆకాశలక్కవరం, కాకరాపల్లి, హనుమంతరాయుడిపేట, దండు గోపాలపురంలకు చెందిన ప్రజలు గొల్లు పెట్టడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. థర్మల్ ప్లాంట్లు వెలువరించే బూడిద తమని అనారోగ్యం పాలు చేస్తుందని, తమ పచ్చని పైరు భూముల్లో నిప్పులు పోస్తుందని వారు గ్రహించారు. కాబట్టే పవర్ ప్లాంట్లు పెట్టి తమ కడుపు కొట్టొద్దని నినదిస్తున్నారు.

## పచ్చని సీమలో కరెంటు చిచ్చు

గోదావరి జిల్లాలకు కోనసీమ ఎలాంటిదో ఉత్తరాంధ్రకు ఉద్దానం అలాంటిది. ఆకు పచ్చగా కళకళలాడుతూ ఉంటుంది. అలాంటి 'ఉద్యానవనం' నడిబొడ్డునున్న సోంపేట మండలంలోనే నాగార్జునా కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్.సి.సి.) సంస్థ మరో 2640 మె.వా. థర్మల్ ప్లాంట్‌ను నిర్మించాలని చూస్తోంది. సంతబొమ్మాళిలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ కంపెనీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను గుట్టుగా జరిపేసింది కానీ సోంపేటలో అలా సాధ్యం కాలేదు. దాని నిర్మాణానికి ఒప్పుకొనేది లేదంటూ ప్రజలు 11 నెలలుగా పోరాడుతున్నారు. గొల్లగండిలో ఆగష్టు 18, 2008న జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో తీవ్ర నిరసనను తెలియపరిచారు. 'పర్యావరణ పరిరక్షణ సమితి'గా ఏర్పడి శాంతియుత ఆందోళనలను నిర్వహిస్తున్నారు.

తమ చిత్తడి నేలల్ని ప్రభుత్వం బంజరు భూమిగా ప్రకటించి 1200 ఎకరాలను ఎన్.సి.సి. కి ఇచ్చినందుకు వారు తీవ్ర నిరసనను వ్యక్తపరుస్తున్నారు. స్థానికులు ఈ భూముల్ని పెదబీల అంటారు. ఈ పెదబీల చినబీలతో కలిశాక ఇద్దువానిపాలెం వద్ద తంపరతో కలిసి సముద్రం దాక విస్తరిస్తుంది. పెదబీల మీద మూడు ఎత్తిపోతల పథకాలు సాగునీరు అందిస్తున్నాయి. ఈ బీల నీటిపై ఆధారపడి దాదాపు 5 వేల ఎకరాల్లో వరిని రెండు పంటలుగా పండిస్తున్నారు. తాగునీటికీ, సాగు నీటికీ కొరత రాకుండా ఈ బీల భూమే వారిని కాపాడుతుంది. మాణిక్యపురం ప్రజలు ఈ బీలలోనే చేపల వేట చేసుకుని జీవిస్తారు. వీరేకాక ఇరవై పైచిలుకు తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు రాబోయే థర్మల్ ప్లాంట్‌వల్ల జీవనాన్ని కోల్పోతారు. ఇక్కడకు కూడా అనేక రకాల పక్షులు వేల సంఖ్యలో వచ్చి బస చేస్తాయి.

బీల భూములు కూడా పర్యావరణ ప్రాధాన్యాన్ని కలిగినవే. ఆంగ్లంలో వెట్‌ల్యాండ్స్ అని పిలిచే ఈ నీటి ప్రదేశాలు సున్నితమైన జీవావరణ వ్యవస్థనూ, జీవ వైవిధ్యాన్నీ కలిగి పర్యావరణ సమతుల్యానికి తోడ్పడతాయి. వీటిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు వినాశకర పద్ధతులేవీ అవలంబించకుండా ఇప్పటిదాకా పర్యావరణాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూనే వస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇవి వారికి ఎంతో సహాయపడతాయి. అలాగే వరద తీవ్రతనూ అరికడతాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవ శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) చేసే పనిని ఈ భూములు చేస్తున్నాయి. ఇలాంటి విలువైన ప్రదేశాల్లో థర్మల్ పవర్ ప్లాంట్లు నెలకొల్పడం అవివేకమే కాక నష్టదాయకం. అమూల్యమైన ఈ నీటి వనరులను భావితరాలకు అందించడం మన బాధ్యత.

ఈ కరెంటు షాక్‌ల కథ అప్పుడే కంచికి పోలేదు. కంచిలి, కవిటిలకు కూడా చేరింది. ఆ రెండు చోట్ల కూడా ప్రయివేట్ థర్మల్ ప్లాంట్లు రానున్నాయి. ఇచ్ఛాపురం సమీపంలోని డొంకూరు వద్ద ఉన్న తంపర భూముల్లో జెన్‌కో 1000 మె.వా.కు

పైబడిన సామర్థ్యం గల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించే ప్రతిపాదన చేసింది. అవన్నీ కూడా వస్తే శ్రీకాకుళం జిల్లాలో 90 కి.మీ పరిధిలో 10 వేల మె.వాకు పైగా విద్యుత్తు ఉత్పత్తి చేసే ఆరు బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంట్లు ఉంటాయి. మధ్యలో ఉన్న వజ్రపు కొత్తూరు, మందస తీర ప్రాంతాల్లో కూడా ఈ తరహా ప్రాజెక్టులు రానున్నాయని వినికిడి. అంటే జిల్లాలో ఒక 'థర్మల్ కారిడార్' ఏర్పాటవుతుందన్న మాట. ఈ కంపెనీలన్నీ విద్యుత్తును తమకు నచ్చిన వారికి అమ్ముకుని లాభాలు గడించడమేకాక మరిన్ని లాభాలకోసం ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకుంటూ పోతాయి. అప్పుడు వారికి మరిన్ని భూములు కావాలి. వారి లాభాల కోసం బొగ్గును కాల్చి కాల్చి ప్రజలకు మాత్రం బూడిదను మిగులుస్తారు.

శ్రీకాకుళం ఉత్తర భాగం పరిస్థితి ఇదైతే ఇక దక్షిణాన పైడి భీమవరం పారిశ్రామిక ప్రాంతంలో మందుల కంపెనీల కాలుష్యంవల్ల పల్లెలు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. అరిణాం అక్కివలస లోని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ పరిసర గ్రామాల్లో విషం చిమ్ముతూనే ఉంది. అయినా కాలుష్య నియంత్రణ మండలి, ఇతర ప్రభుత్వ శాఖలు నిద్ర నటిస్తూనే ఉన్నాయి.

ఇవి చాలవన్నట్టు ఈ మధ్యనే కొవ్వాడ మత్స్యలేశం వద్ద కేంద్ర ప్రభుత్వం అణు విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించాలని తలపెట్టింది. అణువిద్యుత్తు మన ఇంధన సమస్యకు ఏమాత్రం పరిష్కారం కాదు. పైగా అన్ని విధాల హానికరం కూడా. అది వచ్చేస్తే కొవ్వాడ మత్స్యలేశమేకాక రామచంద్రాపురం, గుడాం, పాతర్లపల్లి, కొచ్చెర్ల, సూరంపేట, కోటపాలెం తదితర గ్రామాలు కూడా కనుమరుగవుతాయి.

మన జిల్లాలో ఇలాంటి వినాశకర అభివృద్ధిని తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. అభివృద్ధి పేరిట సామాన్య ప్రజల జీవనోపాధికీ, జీవించే హక్కుకూ, పర్యావరణానికీ ఇంతటి ముప్పును తీసుకురావడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. భూమీ, నీరూ, తీరం వంటి ప్రకృతి వనరులు ప్రజలవి. ప్రస్తుత పారిశ్రామిక విధానం, అభివృద్ధి నమూనా విధ్వంసకర మైనవని ఎందుకు అంటున్నామంటే అవి ఆ వనరుల మీద ఆధారపడి బతుకుతున్న ప్రజలను వాటినుండి తరిమేస్తున్నాయి కాబట్టి కాబట్టే ఇది జరగడానికి వీల్లేదని అడ్డుపడదాం. హేతుబద్ధమైన ఆర్థిక అభివృద్ధి నమూనా కోసం డిమాండ్ చేద్దాం.

25-12-2009

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)

## కార్యక్రమం

**డిసెంబర్ 25:**
**ఉదయం పైడి భీమవరం పారిశ్రామిక ప్రాంతంలో మొదలై అల్లివలస, మెంటాడల మీదుగా కొవ్వాడ మత్స్యలేశం, రామచంద్రాపురం, పాతర్లపల్లి, కొచ్చెర్ల, సూరంపేట, గుడాం గ్రామాల్లోనూ, నాగార్జున అగ్రికెమ్ బాధిత గ్రామాల్లోనూ జరుగుతుంది.**

**డిసెంబర్ 26:**
**సంతబొమ్మాళి మండలంలో వడ్డితాండ్ర, ఆకాశలక్కవరం, మేఘవరం, తేలినీలాపురం తదితర గ్రామాల్లో జరుగుతుంది.**

**డిసెంబర్ 27:**
**సోంపేట, కవిటి మండలాల్లోని బెంకిలి, జింకిభద్ర, బారువా, గొల్లగండి, ఇసుకలపాలెం, రుషికుద్ద, కుత్తుము, మాణిక్యపురాల్లో సాగుతుంది.**

ప్రచురణ : వి.ఎస్. కృష్ణ, 54-11-59/2, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, విశాఖపట్నం – 530 022. ఫోన్ : 2543817